క్లుప్తంగా

'బక్రీద్' ప్రశాంతంగా చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ మతాల పెద్దలతో పోలీసు అధికారులు శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పండుగ రోజున పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని మతాల పెద్దలు పోలీసులకు సహకరించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో మత కలహాలను సృష్టించే, రెచ్చగొట్టే పోస్టులను పెడితే పోలీసులకు సమాచారమందించాలన్నారు.ఈ సందర్భంగా గోవధ, గోవుల అక్రమరవాణాను అడ్డుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ కోరారు. కార్యక్రమంలో సీఐలు మనోహర్, మస్తాన్, ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ వెంకటస్వామి, వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు.

యల్లనూరు: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి సూచించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

బాలుడి అదృశ్యం



భరత్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పోర్టర్స్‌లైన్ ఏరియాకు చెందిన పరుశరాముడి కుమారుడు భరత్ అనే 13 ఏళ్ల బాలుడు బుధవారం రాత్రి నుంచి అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు తిరిగిరాలేదు. తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించినా బాలుడి ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 9440796821 నంబర్‌కు సమాచారమందివ్వాలని సీఐ గురువారం తెలిపారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

గుత్తి: ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికే నగదు బదిలీ విధానం అమలు చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని సీపీఎం మండల కార్యదర్శి నిర్మల మండిపడ్డారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలసి ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు రేషన్ సరుకులు అందుతున్నాయన్నారు. అయితే ప్రజా పంపిణీ వ్యవస్థనే రద్దు చేయాలని చూడటం దారుణమన్నారు. నగదు బదిలీ పథకానికి సీపీఎం అంగీకరించదన్నారు. ప్రభుత్వం ఆలోచనను విరమించుకోకపోతే ఉద్యమిస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు రేణుక, మల్లేష్, రామకృష్ణ, ఓబులేసు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

10న కసాపురంలో హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 10న భక్తులు స్వామివారికి సమర్పించిన హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఈఓ కే వాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే హుండీ లెక్కింపు కార్యక్రమానికి ఆలయ సిబ్బంది హాజరు కావాలన్నారు.

నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం: రైతులు నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రేకులకుంటలో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానంలో విత్తన ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ శంకర్‌బాబు మాట్లాడుతూ పంటలు సాగు చేసే సమయంలో రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలన్నారు. తద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు సాగుచేసేముందు విత్తనశుద్ధి తప్పని సరిగా చేసుకోవాలన్నారు. తద్వారా అనేక సూక్ష్మ వ్యాధులు నశించిపోతాయన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నటరాజ్, రైతులు పాల్గొన్నారు.

• గోడలకే పరిమితం!



ముళ్లకంపలతో నిండిన ఇండోర్ స్టేడియం గోడలు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రూ.లక్షల వ్యయంతో పనులు ప్రారంభించిన ఇండోర్ స్టేడియం పూర్తి కాలేదు. సంవత్సరాలు గడుస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. అర్థాంతరంగా నిలిచిపోయిన పనులను ప్రారంభించడంలో జరుగుతున్న జాప్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇండోర్ స్టేడియం గోడలకే పరిమితం కావడంతో ముళ్లకంపలు పెరిగిపోయాయి. అధికారులు స్పందించి ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని క్రీడాకారులు, విద్యార్థులు కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు





రజాపురం సమీపంలోని పొలాల్లో కిందకు వంగిన విద్యుత్ స్తంభాలు

- భయాందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

గుత్తి: మండలంలోని రజాపురం గ్రామ సమీపంలో పెద్దొడ్డికి వెళ్లే రహదారిలో ఉన్న పొలాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. దీంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. సుమారు ఐదుగురు రైతుల పొలాల్లో విద్యుత్ స్తంభాలు పూర్తిగా కిందకు వంగిపోయాయి. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని వ్యవసాయ పనులు చేసే రైతులు, కూలీలు భయాందోళనకు గురవుతున్నారు. గత ఆరు నెలల క్రితం ఇదే ప్రాంతంలో విద్యుత్ స్తంభం కూలి ఎద్దు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఆ సమస్యలను పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను సరి చేయాలని రైతులు అల్లెప్ప, శ్రీనివాసులు తదితరులు కోరారు.

భయంగా ఉంది



విద్యుత్ స్తంభాలు ఒకవైపు ఒరగడంతో భయంగా ఉంది. ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు సరిచేయాలి.

– రైతులు అల్లెప్ప, శ్రీనివాసులు, సాయి

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



గుత్తిలో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి రామాంజనేయులు



పామిడి గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఎంఈఓ జయానాయక్



పెద్దవడుగూరులో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

గుత్తి/గార్లదిన్నె/పెద్దవడుగూరు/పామిడి: 40 రోజులుగా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు గురువారం ఘనంగా ముగిశాయి. గుత్తిలో గ్రంథాలయ పితామహుడు అద్దంకి వెంకట రమణయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రామాంజనేయులు, ఉపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయాధికారి ఏసీ సుబ్బన్న, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి శిరీష మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. అదేవిధంగా పెద్దవడుగూరు గ్రంథాలయంలోని విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాముడు, ప్రధానోపాధ్యాయులు హుసేనప్ప, రహంతుల్లా, సీపీఐ మండల నాయకుడు సూర్యనారాయణరెడ్డి, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పామిడిల గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంఈఓలు జయానాయక్, సత్యనారాయణ, గ్రంథాలయాధికారి జీ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకులు దోచుకుంటున్నారు..

- తాడిపత్రిలో కేబుల్ ఆపరేటర్లపై టీడీపీ నాయకుల దాడులు
- ఇష్టారాజ్యంగా కేబుల్ కనెక్షన్ల తొలగింపు
- రమేష్‌రెడ్డి ధ్వజం



కొనుదుల రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: అధికారం మాది అందినకాడికి దోచుకుంటామన్న రీతిలో తాడిపత్రిలో అధికార పార్టీ నాయకుల వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి ఆరోపించారు. తాడిపత్రిలో కేబుల్ ఆపరేటర్లపై అధికారపార్టీ నాయకుల కొంత మంది దౌర్జన్యాలకు దిగుతున్నారని, ఇతర కేబుల్ ఆపరేటర్ల కనెక్షన్లను తొలగిస్తూ అనధికార కనెక్షన్లను ప్రజలకు అందజేస్తూ కలెక్షన్ల రూపంలో అందినకాడికి దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. తాడిపత్రి పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. తాడిపత్రిలో అధికార పార్టీ నాయకులు కేబుల్ ఆపరేటర్, నెట్‌వర్క్‌లపై దాడులకు తెగబడుతున్నారన్నారు. రాత్రికి రాత్రి కేబుల్ కనెక్షన్లను తొలగిస్తూ ఇష్టారీతిన వారి అనధికార కేబుల్ కనెక్షన్లు ప్రజలకు అంటగడుతున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు పోలీస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి ఫలితం లేదన్నారు. గత వారంలో గుత్తిలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా తాడిపత్రి కేబుల్ ఆపరేటర్లందరూ వినతి పత్రం అందజేశామన్నారు. తక్కువ రేటుకే కేబుల్ కనెక్షన్ ఇచ్చి ప్రజల మన్ననలను పొందాలి గానీ కేబుల్ ఆపరేటర్లపై దౌర్జన్యాలకు దిగుతూ కలెక్షన్ల రూపంలో ప్రజల నుంచి అందినకాడికి దోచుకోవడం తగదన్నారు. ఇలాంటి దౌర్జన్యాలు తావులేకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత 30 ఏళ్లుగా కేబుల్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న వారికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

'వైఎస్సార్‌సీపీలో కష్టపడే వారికే పదవులు'

యాడికి: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు తప్పక లభిస్తాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు అన్నారు. పార్టీ బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని రాయలచెరువు గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నాగేష్‌ను నియమించారు. రాయలచెరువులో గురువారం రాత్రి 8గంటల సమయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి మండల కన్వీనర్‌తో పాటు దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్ శాలువాలు, పూలమాలలతో నాగేష్‌ను ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వారికి అధిష్టానం న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

8న కంటి వైద్య శిబిరం

శింగనమల: మండల కేంద్రంలో ఈ నెల 8న వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం శాంతిరాం ఐ హాస్పటల్ ప్రతినిధులు నిర్వహిస్తారని ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి గురువారం తెలిపారు. వాసవీ కల్యాణ మండపంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి రూరల్: స్థానిక మునిసిపల్ కౌన్సిల్ హాలులో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశామని కమిషనర్ శివరామక్రిష్ణ గురువారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

ప్రైవేట్ పాఠశాల మూసివేత

పుట్లూరు: మండలంలోని ఎ.కొండాపురం గ్రామంలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలను మూసివేసినట్లు ఎంఈఓ శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతులను రెన్యువల్ చేసుకోవకపోవడం వల్ల పాఠశాలను రద్దు చేసినట్లు ఆమె వివరించారు.

శుభకార్యం



యాడికి ఎంపీపీ ఉమాదేవి, బొంబాయి రమేష్ నాయుడు కుమారుడి వివాహంలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

యాడికి: మండల ఎంపీపీ ఉమాదేవి, బొంబాయి రమేష్ నాయుడు దంపతుల కుమారుడు ఉపేంద్ర నాయుడు– సుభాషిణి వివాహం గురువారం గుత్తి పట్టణంలోని విరుపాక్షరెడ్డి కన్వెన్షన్‌లో గురువారం జరిగింది. వివాహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, తాడిపత్రి మునిసిపల్ కౌన్సిలర్ కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సంజీవరాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, మహిళా రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత, ఎంపీటీసీలు వెంకట నాయుడు, నాగరాజు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, మండల నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పెళ్లిలో మాజీ మంత్రి 'బుగ్గన'

పామిడి: పట్టణంలోని కోగటం ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన సంద్యాల జిల్లా ప్యాపిలి మండలం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పోతుదొడ్డి కృష్ణమూర్తి కూతురి వివాహానికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా వధూవరులు పెరమసాని నాగరాజు, స్వర్ణలతను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగాతి మురళీ మోహన్‌రెడ్డి, పెరమసాని రామాంజనేయులు, పుంజా కృష్ణారావు యాదవ్, ప్రభాకర్‌చౌదరి, గౌస్‌పీరా, బొల్లు శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణారెడ్డి. పెద్దిరెడ్డి, దేవేంద్ర, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం ..

యల్లనూరు: ఉద్యోగం ఇప్పిస్తానని ధర్మవరానికి చెందిన మైలా మల్లేష్ రూ.10 లక్షలు డబ్బులు తీసుకున్నాడని మండలంలోని వేములపల్లికి చెందిన బనగాని గంగయ్య ఫిర్యాదు మేరకుగురువారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ధర్మవరం టౌన్ మారుతీనగర్‌కు చెందిన మల్లేష్ తనకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బాగా తెలుసునని మభ్యపెట్టి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10,00,000 ఫోన్‌పే, ఆర్‌టీజీఎస్ వేయించుకొని ఉద్యోగం ఇప్పించకుండా కాలయాపన చేస్తున్నారని బాధితుడు ఆరోపించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



గుంతకల్లులో మొక్క నాటుతున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా



గుంతకల్లులో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్ తదితరలు



కసాపురంలో మొక్కనాటి నీరు పోస్తున్న దృశ్యం



గుంతకల్లు కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతున్న జడ్జి మంజుల

గుంతకల్లు/గుంతకల్లుటౌన్/గుంతకల్లు రూరల్/గుత్తి/యాడికి/పెద్దవడుగూరు/బుక్కరాయసముద్రం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గుంతకల్లులోని రైల్వే ఆస్పత్రి వెనుక భాగాన మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు పలు విభాగాల అధికారులు మొక్కలు నాటారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకం తగ్గించి కాలుష్యాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. అలాగే మున్సిపల్ గర్ల్స్‌హైస్కూల్ ఆవరణలో కమిషనర్ నయీమ్ అహ్మద్ మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సచివాలయ కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో వనం–మనం కార్యక్రమం చేపట్టారు. ఈఓ కె.వాణి, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

▸▸ పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని గుంతకల్లు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి మంజుల అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కోర్టు ఆవరణలో ఆమె మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రజబ్‌వలి, యూనస్, గోపాలక్రిష్ణ, తిమ్మప్ప, క్రిష్ణారెడ్డి, వెంకటనాయుడు, వెంకటేష్, తాజుద్దీన్, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

▸▸ గుంతకల్లులో మున్సిపల్, సచివాలయ, మెప్మా అధికారులు, సిబ్బంది పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ పార్క్‌లో మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, మెప్మా కో–ఆర్డినేటర్లు చంద్ర, సురేఖ, డీఈ హేమచంద్ర, మున్సిపల్ మేనేజర్ రాంబాబు, పలువురు ఆర్పీలు పాల్గొన్నారు.

▸▸ యాడిలోని వెంకటేశ్వర మండల సమాఖ్య వెలుగు కార్యాలయం ఆవరణలో ఏపీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలోఏపీఎం చంద్రశేఖర్, సీసీ రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, పుల్లయ్య, ప్రియాంక, అరుణ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

▸▸ పెద్దవడుగూరులో సుమంత్ ఎన్విరాల్‌మెంట్ రూరల్ అగ్రికల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బారన్‌సాహెబ్, ఏపీడీ పుల్లారెడ్డి, ఎస్‌ఐ ఆంజనేయులు, ఏపీఎం ఖలీల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

▸▸ బుక్కరాయసముద్రం మండలంలోని రేకులకుంటలో వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు. పెద్దపప్పూరు మండలం జూటూరులోని కేజీబీవీ పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ శంకుంతల మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

▸▸ పామిడి మండలవ్యాప్తంగా పంచాయతీ కార్యాలయాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ తేజోత్స్న, ఎద్దులపల్లి సర్పంచ్ జీ వెంకటరమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు జీ వీరా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో మొక్క నాటుతున్న దృశ్యం



పెద్దవడుగూరులో మొక్క నాటుతున్న అధికారులు



రేకులకుంటలో మొక్క నాటుతున్న ప్రధాన శాస్త్రవేత్త విజయ శంకర్‌బాబు



పెద్దపప్పూరులో మొక్క నాటుతున్న ఎంపీడీఓ శంకుంతల

ప్రచారం సరే.. ఆచరణ ఏదీ!

తాడిపత్రి రూరల్: మొక్కల పెంపకంపై ఉన్న ప్రచారంపై అధికారులు ఆచరణలో చూపడం లేదని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని పెన్నానది ఒడ్డున గల పార్కులో గురువారం మునిసిపల్ అధికారులతో కలసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జేసీ వివాదస్పద వాఖ్యలు చేశారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో బోర్డులు ఏర్పాటు చేయడం, వివిధ మార్గాల ద్వారా ప్రచారాలు ఎందుకు చేస్తున్నారో తెలియదని, ఖర్చు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రధానంగా ఫారెస్టు అధికారులు అసలు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా ఫారెస్టు అధికారి గారూ.. మీరు మాకు ఒక మొక్క అన్న ఇచ్చారా? అని ప్రశ్నించారు. మేం కొనుగోలు చేసి మొక్కలు నాటుతున్నామన్నారు. మండలంలోని యర్రగుంటపల్లిలోని ఫారెస్టు నర్సరీలో ఒక మొక్క కూడా లేదన్నారు. తనకు ఆరు వేల మొక్కలు కావాలని డిమాండ్ చేశారు. మొక్కల పెంపకంపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారే తప్ప అచరణ ఎక్కడ? కలెక్టర్‌ను ప్రశ్నించారు. పెద్ద పెద్ద చెట్లను కొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.



ప్రచార బోర్డును చూపిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

సైకిల్ రిక్షాలు ఇలా...చెత్త సేకరణ ఎలా..?



గరుగుచింతలపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మరమ్మతుకు గురైన చెత్త సేకరణ సైకిల్ రిక్షాలు

పుట్లూరు: చెత్త సేకరణ కోసం ప్రభుత్వం అందించిన సైకిల్ రిక్షాలు మరమ్మతులకు గురై పంచాయతీ కార్యాలయాల ముందే చెత్తగా మారిపోయాయి. మండలంలోని పలు గ్రామాల్లో చెత్త సేకరణ కోసం వినియోగించే సైకిల్ రిక్షాలు నిరుపయోగంగా మారాయి. 2018లో ఇచ్చిన ఈ సైకిళ్లు తరచూ మరమ్మతులకు గురికావడంతో చాలా గ్రామాల్లో చెత్త సేకరణ ఇబ్బందికరంగా మారింది. రిక్షాలు తరచూ మరమ్మత్తులకు గురి కావడంతో వీటితో చెత్త సేకరణ ఎలా..? అని పారిశుధ్య కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త సైకిల్ రిక్షాలను మంజూరు చేయాలని కోరుతున్నారు.